MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 202 | శుక్రవారం 27 నవంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-

పరిశ్రమలు, అమరావతి అభివృద్ధికి భారీ ఊతం!

చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు..

దాదాపు 30 అంశాలకు ఆమోదం.. రూ.36 వేల కోట్ల పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్..

పెనుకొండలో కియా రెండో ప్లాంట్.. రాజధాని పనులకు రూ.1,215 కోట్లు





అమరావతి:

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతి, రాజధాని అమరావతి నిర్మాణం, విద్యుత్ రంగాభివృద్ధి, భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సుమారు మూడు గంటలపాటు కొనసాగింది. వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో దాదాపు 30 అంశాలపై చర్చించి పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను తీసుకురావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, రాజధాని నిర్మాణాన్ని వేగవంతం చేయడం, రైతుల భూ సమస్యలను పరిష్కరించడంపై కేబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది.

రూ.36 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఐఐ భాగస్వామ్య సదస్సుల ద్వారా వచ్చిన ఆరు ప్రముఖ కంపెనీల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. వీటి ద్వారా సుమారు రూ.36 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉంది. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పరిశ్రమల స్థాపనలో అనుమతుల జాప్యాన్ని తగ్గించేందుకు ఏపీ ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లు-2026కు ఆమోదం తెలిపింది. - మిగతా2లో

ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల టీటీడీ ప్రత్యేక అధికారిగా అర్జా శ్రీకాంత్

(అంకుశం, అమరావతి, నవంబర్ 27):

న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. న్యూఢిల్లీ, కురుక్షేత్ర, రిషికేశ్, జమ్ములోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాల పరిపాలన, భక్తుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిని పర్యవేక్షించడంతో పాటు అస్సాం, ఉత్తరప్రదేశ్, త్రిపుర రాష్ట్రాల్లో టీటీడీ సంబంధిత వ్యవహారాలను ఆయన సమన్వయం చేయనున్నారు. - మిగతా2లో

రాజమహేంద్రవరం కోర్టుకు 222 ఏళ్ల పండుగ

బార్ అసోసియేషన్‌కు 131 ఏళ్లు!

దేశంలోనే తొలిసారి జిల్లా కోర్టు, బార్ అసోసియేషన్ వార్షికోత్సవాలు

వేడుకకు హాజరుకానున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, సీఎం చంద్రబాబు

(అంకుశం, అమరావతి, నవంబర్ 27): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో న్యాయ చరిత్రకు శనివారం అపూర్వ ఘట్టం నెలకొననుంది. జిల్లా కోర్టు ఏర్పడి 222 ఏళ్లు, బార్ అసోసియేషన్ ఏర్పాటై 131 ఏళ్ల సందర్భంగా వేడుక నిర్వహించనున్నారు. ఈ వేడుకను రాష్ట్ర ఉత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టుకు చెందిన పలువురు న్యాయమూర్తులతో పాటు, సీఎం చంద్రబాబు హాజరుకానున్నారు. దేశంలోనే తొలిసారి ఒక జిల్లా కోర్టు, బార్ అసోసియేషన్ వార్షికోత్సవాలను సంయుక్తంగా ఇంత భారీగా నిర్వహించడం ఇదే మొదటిసారని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, జస్టిస్ సరసా వెంకటనారాయణ భట్టి, ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ లిసా గిల్, త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎం.ఎస్. రామచంద్రరావు హాజరుకానున్నారు. వీరితో పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన హైకోర్టు న్యాయమూర్తులు, రిటైర్డ్ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు కూడా హాజరవుతారని నిర్వాహకులు వెల్లడించారు.



రాజమహేంద్రవరం కోర్టు చరిత్ర..

1804లో జిల్లా ప్రధాన న్యాయస్థానం ఏర్పడింది. బ్రిటిష్ పాలనలో దేశంలో ఏర్పాటు చేసిన 5 న్యాయస్థానాల్లో ఇది ఒకటి.

-- 1895లో బార్ అసోసియేషన్ ఏర్పడింది. వ్యవస్థాపక అధ్యక్షుడు న్యాపతి సుబ్బారావు పంతులు -- స్వాతంత్ర్య సమరయోధుడు.

-- 1804 నుంచి ఇప్పటివరకు 150 మంది జిల్లా ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేశారు. ప్రస్తుత పీడీజే జునైద్ అహ్మద్ మౌలానా 151వ వారు.

-- ప్రస్తుతం రాజమహేంద్రవరంలో 18 కోర్టులు ఉన్నాయి.

ఆంబులెన్స్‌లో ఎర్ర చందనం రవాణా

114 దుంగలు స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్



(అంకుశం, అమరావతి, నవంబర్ 27):

అంబులెన్స్, కారు, ఇన్నోవా, ఆటో, దేంట్లో చూసినా ఎర్ర చందనం దుంగలే. అటవీశాఖ అధికారులు శుక్రవారం ఐదు ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ ఆపరేషన్ నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న 114 ఎర్రచందనం దుంగలను, ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక మారుతి సుజుకి స్విఫ్ట్ డిజైర్ కారు, రెండు టయోటా ఇన్నోవా కార్లు, రెండు ఆటోలు, ఒక ద్విచక్ర వాహనంతో పాటు ఒక ఆంబులెన్స్‌ను సీజ్ చేయడంతో పాటు ముగ్గురిని అరెస్ట్ చేశారు. వైఎస్ఆర్ కడప డివిజన్ పరిధిలో యాంటి రెడ్ శాండర్స్ టాస్క్ - మిగతా2లో

దక్షిణాది అడ్వెంచర్ హబ్‌గా గండికోట

నిమాస్, అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ మధ్య అవగాహన ఒప్పందం

(అంకుశం, అమరావతి, నవంబర్ 27):



దక్షిణ భారతదేశంలో గండికోటను అగ్రగామి అడ్వెంచర్ ట్రైనింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే సచివాలయంలో శుక్రవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (నిమాస్), అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ మధ్య అవగాహన ఒప్పందం చేసుకున్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్.రావత్, సెక్రటరీ ఆమ్రపాలిల సమక్షంలో నిమాస్ డైరెక్టర్ కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్, అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ కార్యదర్శి ఉన్నాది రఘునాథ్ రెడ్డిలు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. -



లోక్‌సభ సీట్ల పెంపునకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్!

- అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్ల పెంపునకు ప్రతిపాదన
- 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన

2లో

దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలకు చెక్ పెట్టేలా సవరణలు

దక్షిణాది అడ్వెంచర్ హబ్‌గా గండికోట

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ద్వారా స్థానిక యువతకు వృత్తిపరమైన శిక్షణ అందించి, వారిని అర్హత కలిగిన అడ్వెంచర్ గైడ్‌లు, ఇన్‌స్ట్రక్టర్లు, రెస్క్యూ సిబ్బంది, అవుట్‌డోర్ లీడర్లు, పర్యాటక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వచ్చే ఏడాది జనవరి 6 నుండి 31 వరకు గండికోటలో మొదటి 'కంబైన్డ్ బేసిక్, ఇంటర్మీడియట్ పారామోటార్ కోర్సు' నిర్వహించనున్నట్లు వివరించారు. దక్షిణ భారతదేశంలోని ఔత్సాహిక పైలట్లు, సాహస క్రీడాకారులకు ఇది గొప్ప అవకాశంగా నిలవనుందని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వెల్లడించారు. నిమాస్ డైరెక్టర్ కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో సాహస క్రీడలకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. గండికోటలో పారామోటార్ శిక్షణతో ప్రారంభమయ్యే ఈ భాగస్వామ్యం, భవిష్యత్తులో ల్యాండ్, ఏరో, ఆక్వా విభాగాలలోని ఇతర సాహస క్రీడలకు విస్తరిస్తుందని తెలిపారు.

ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల టీటీడీ ప్రత్యేక అధికారిగా అర్జా శ్రీకాంత్

-మొదటిపేజీ తరువాయి

తన ప్రధాన బాధ్యతల్లో భాగంగా అర్జా శ్రీకాంత్ ప్రతి 15 రోజులకు ఒకసారి ఆలయాలను ప్రత్యక్షంగా తనిఖీ చేసి, సమస్యలను గుర్తించి, దిద్దుబాటు చర్యలపై సిబ్బందికి మార్గదర్శకత్వం వహిస్తారు. అనంతరం ప్రతి పక్షం రోజులకు ఒకసారి సమగ్ర నివేదికలను టీటీడీ ఉన్నతాధికారులకు సమర్పిస్తారని ప్రభుత్వం వెల్లడించింది. ఆలయాల్లో ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం నిత్య కైంకర్యాలు, సేవలు, ఉత్సవాలు, తాజా పూల సరఫరా, సకాలంలో ప్రసాద వితరణ జరిగేలా చూడటంతో పాటు సులభతర దర్శనం, క్యూలైన్లు, పారిశుద్ధ్యం, తాగునీరు, భద్రతా ప్రమాణాలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలను శ్రీవారి సేవకుల సహకారంతో ఆయన పర్యవేక్షిస్తారు. క్షేత్రస్థాయి తనిఖీలు, రాష్ట్రాల మధ్య సమన్వయంతో ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల్లోని టీటీడీ ఆలయాల్లో పరిపాలనా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి, భక్తులకు అత్యుత్తమ దర్శన అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ నియామకం చేసినట్లు వెల్లడించారు.

ఆంబులెన్స్‌లో ఎర్ర చందనం రవాణా

-మొదటిపేజీ తరువాయి

ఫోర్స్, అటవీశాఖ అధికారులు ఒకేసారి వేర్వేరు చోట్ల దాడులు నిర్వహించారు.
ఎర్ర చందనం వైపు దొంగలు చూడాలంటే వణుకు పుట్టాలి..
ఎర్ర చందనం దొంగలు దుంగ వైపు చూడాలంటే వెన్నులో వణుకు రావాలని డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అక్రమ రవాణా ముఠాలకు ఉన్న అన్ని దారులూ మూసుకుపోయేలా ఆపరేషన్స్ నిర్వహించాలని యాంటీ రెడ్ శాండర్స్ టాస్క్ ఫోర్స్, అటవీ శాఖ అధికారులకు సూచించారు.
అక్రమ రవాణా ముఠాలకి ఉన్న అన్ని దారులూ మూసుకుపోయేలా ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో పాల్గొన్న కడప జిల్లా అటవీశాఖ అధికారి, వారి సిబ్బందిని పవన్ కళ్యాణ్ అభినందించారు. సమన్వయంతో, వ్యూహాత్మకంగా పనిచేసి అక్రమ రవాణాను గుర్తించి, నిందితులను పట్టుకున్నారని పేర్కొన్నారు. ఆపరేషన్‌కి సంబంధించిన వివరాలు అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్రమ రవాణా వ్యవహారంలో తప్పించుకున్న ఇతర నిందితులను గుర్తించి తక్షణం అరెస్టు చేయాలని, స్మగ్లింగ్ మూలాలు తెలుసుకునే విధంగా దర్యాప్తు సాగాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు.

వరదాపురం సూరి ధర్మవరం టీడీపీ లో చేరిక పై ఉహాగానాలు



అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 27 మాజీ ధర్మవరం ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్య నారాయణ తిరిగి టీడీపీ లో చేరే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి పదవి ఖాళీ గా వుంది కనుక ఆయన ఇప్పుడు లేదా నూతన సంవత్సర కానుక గా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జాతీయ నాయకులు నారా లోకేష్ ల సమక్షంలో చేరగలరు అని ఊహా గానాలు వినిపిస్తున్నాయి. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గా గోనుగుంట్ల సూర్య నారాయణ ఈ నియోజకవర్గం కు ఎనలేని సేవలు అందించారు. ఆయన అభిమానులు ధర్మవరం నియోజకవర్గం లో అధికంగా వున్నారు. అయితే వచ్చే సంక్రాంతి లేదా ఉగాది కి ఆయన తిరిగి టీడీపీ తీర్థం పుచ్చుకోవచ్చును అని అంటున్నారు.వరదాపురం సూరి అంటే ఇప్పటికీ ఆయనను ఇష్టపడే అభిమానులు అనేకమంది వున్నారు.

27వ వార్డు ప్రజా సమస్యలపై రోజువారి కార్యకర్తలతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన



అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 27 వార్డులో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి తొలి ప్రాధాన్యత త్రాగునీటి సమస్యకు తొలి ప్రాధాన్యతగా కృషిబిలి చెత్త రహిత,త్రాగునీటి సమస్యలేని వార్డుగా గుర్తింపు తేవాలని లక్ష్యంగా వార్డులో ప్రజలతో మమేకంబిలి ధర్మవరం పట్టణం 27వ వార్డు సిద్దయ్యగుట్ట,సాయి నగర్ లలో క్షేత్రస్థాయిలో పర్యటించి వార్డులో గల ప్రజా సమస్యలపై తక్షణం పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని 27వ వార్డు కౌన్సిలర్ పురుషోత్తం గౌడ్ అన్నారు.గత ఐదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న వార్డులో సమస్యలను రోజువారిగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తున్నామని, ప్రధానంగా 27వ వార్డులో త్రాగునీటి సమస్య,డ్రైనేజీ సింట్ సమస్య,చెత్త సేకరణ సమస్య ప్రధానంగా ఉన్నాయని ఈ సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని పురుషోత్తం గౌడ్ అన్నారు.వార్డును క్లీన్&గ్రీన్ గా తయారుచేసి త్రాగునీటి సమస్య లేని వార్డుగా చూడడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు ఈ సందర్భంగా ప్రతిరోజు ఉదయం రెండు గంటలు పాటు వార్డులో పర్యటిస్తూ,ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించే విధంగా ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా పురుషోత్తం గౌడ్ అన్నారు

త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలపై టిడిపి నాయకులకు సూచనలు చెప్పిన బండారు శ్రావణి శ్రీ...



అంకుశం న్యూస్, అనంతపురం, నవంబర్ : 27 శింగనమల నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలపై వారితో చర్చించారు.గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ, నామినేషన్ల ఉపసంహరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులకు పలు సూచనలు చేస్తూ, అందరూ ఐక్యంగా, సమన్వయంతో పనిచేయాలని, కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కృషి చేయాలని శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ దిశానిర్దేశం చేశారూ.

పరిశ్రమలు, అమరావతి అభివృద్ధికి భారీ ఊతం!

-మొదటిపేజీ తరువాయి

చిన్న, మధ్యతరహా పరిశ్రమలు త్వరగా ఏర్పాటు చేసుకునేందుకు ఈ బిల్లు దోహదపడనుంది.

పెనుకొండలో కియా రెండో ప్లాంట్

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ వద్ద రూ.19 వేల కోట్ల పెట్టుబడితో కియా రెండో ఆటోమొబైల్ తయారీ కేంద్రం ఏర్పాటుకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఈ ప్లాంట్ ఏర్పాటుతో ఆటోమొబైల్ రంగంలో రాష్ట్రానికి మరింత గుర్తింపు లభించడంతో పాటు అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

శ్రీకాకుళంలో అదానీ టైటానియం కాంప్లెక్స్

శ్రీకాకుళం జిల్లాలో రూ.13,667 కోట్ల వ్యయంతో అదానీ ఇంటిగ్రేటెడ్ టైటానియం కాంప్లెక్స్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పారిశ్రామిక రంగంలో ఇది కీలక పెట్టుబడిగా మారనుంది. అలాగే అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో రూ.1,800 కోట్లతో సెయింట్-గోబైన్ ఫ్లోట్ గ్లాస్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది.

అమరావతి నిర్మాణానికి భారీ నిధులు

రాజధాని అమరావతిలో ప్రధాన భవనాల నిర్మాణ పనులకు నిధులు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. హైకోర్టు, శాసనసభ, సచివాలయ నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.
సమీకృత సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాల నిర్మాణ వ్యయాన్ని గతంలో ప్రతిపాదించిన రూ.4,688 కోట్ల నుంచి రూ.6,641 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రాజధాని పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.1,215 కోట్లు మంజూరు చేసింది.

శాఖమూరులో అమరావతి సంగమం

రాజధాని ప్రాంతంలో పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ శాఖమూరు వద్ద 'అమరావతి సంగమం' నిర్మాణానికి రూ.626 కోట్లు కేటాయించింది. అలాగే రాజధాని పరిధిలో గ్రీన్ వర్క్స్ ప్యాకేజీ-2 పనులకు రూ.180.68 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పనులతో రాజధాని ప్రాంతంలో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం లభించనుంది.

విద్యుత్ రంగంలో కొత్త ప్రాజెక్టులు

రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఏపీజెన్‌కో, కోల్ ఇండియా సంయుక్త భాగస్వామ్య సంస్థ (జేవీ) ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తితో పాటు పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధిపైనా దృష్టి సారించింది. వైఎస్సార్ కడప జిల్లా మైలవరంలో 1,000 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు 1,127 ఎకరాల భూమి కేటాయించింది. నంద్యాల జిల్లాలో 210 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు బదిలీ ప్రక్రియకు ఆమోదం తెలిపింది. ప్రకాశం జిల్లాలో రోజుకు 12 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది.

9,917 ఎకరాలకు నిషేధిత జాబితా నుంచి విముక్తి

రైతులు, భూ యజమానులకు ఊరటనిచ్చేలా రెవెన్యూ శాఖకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతపురం జిల్లాలో 9,917 ఎకరాల భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ఆమోదం తెలిపింది. దీనివల్ల 4,352 మంది పట్టాదారులకు ప్రయోజనం కలగనుంది.
అలాగే రైల్వేకోడూరు పరిధిలోని 10,192 ఎకరాల భూములకు సంబంధించిన వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఉన్న తప్పులను సరిదిద్దేందుకు అనుమతి ఇచ్చింది. భూ రికార్డుల్లో లోపాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ నిర్ణయం ఉపశమనం కలిగించనుంది.

ప్రభుత్వ భూముల విషయంలో స్పష్టమైన ఆదేశాలు

భూ వివాదాల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని కేబినెట్ స్పష్టం చేసింది. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, వివాదాల్లో ఉన్న భూములకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్తగా ఎవరికీ హక్కులు కల్పించకూడదని మార్గదర్శకాలు జారీ చేసింది. భూ సమస్యలను పరిష్కరించే క్రమంలో ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

పెట్టుబడులు.. ఉపాధి..

రాజధాని అభివృద్ధే లక్ష్యం

పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేయడం, రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపడం వంటి అంశాలకు ఈ కేబినెట్ సమావేశం ప్రాధాన్యం ఇచ్చింది. భారీ పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. కేబినెట్ ఆమోదించిన ప్రాజెక్టులు కార్యరూపం దాల్చితే పారిశ్రామికంగా ఏపీ మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

లోక్‌సభ సీట్ల పెంపునకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్!



న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీసే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. అన్ని రాష్ట్రాల్లోనూ లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచేలా రాజ్యాంగ సవరణ బిల్లులో మార్పులు ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా ప్రస్తుతం ఆయా రాష్ట్రాలకు ఉన్న లోక్‌సభ స్థానాల నిష్పత్తి మారకుండా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం.

అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్ల పెంపు

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం సేవాతీర్థ్‌లో జరిగిన అత్యవసర కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కథనంలో పేర్కొన్నారు. ప్రస్తుతం లోక్‌సభలో 543 స్థానాలు ఉండగా, వాటిని 50 శాతం పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ఈ పెంపు ద్వారా రాష్ట్రాల వారీగా ప్రస్తుతమున్న సీట్ల నిష్పత్తి కొనసాగనుంది. తద్వారా జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందన్న ఆందోళనలను అధిగమించాలని కేంద్రం భావిస్తోంది. ఈ సీట్ల పెంపు 2051 వరకు కొనసాగించేలా రాజ్యాంగ సవరణలో నిబంధనలు చేర్చినట్లు తెలుస్తోంది. అయితే కొత్తగా పెరిగే స్థానాల తుది సంఖ్య, రాష్ట్రాలవారీగా సీట్ల కేటాయింపుపై అధికారిక బిల్లు వివరాలు వెలువడాల్సి ఉంది.

మహిళా రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం?

లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం అమలుకు డీలిమిటేషన్ ప్రక్రియ కీలకంగా మారింది. నియోజకవర్గాల పునర్విభజనతో పాటు సీట్ల సంఖ్యను పెంచడం ద్వారా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది.
2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్లను అమల్లోకి తీసుకురావడానికి ఈ సవరణలు దోహదపడతాయని అధికారపక్షం చెబుతోంది. లోక్‌సభతో పాటు రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ మహిళలకు ప్రాతినిధ్యం పెరగనుంది. అయితే ఇందుకు సంబంధించిన చట్టపరమైన ప్రక్రియ, అమలు నిబంధనలు పార్లమెంటు ఆమోదం తర్వాత స్పష్టతకు రానున్నాయి.

విపక్షాల మద్దతు కోసం కేంద్రం వ్యూహం

రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీ అవసరం. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం సభకు హాజరై ఓటు వేసిన సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది మద్దతు తప్పనిసరి. దీంతో విపక్షాల మద్దతు కేంద్రానికి కీలకంగా మారింది. గత ఏప్రిల్‌లో నిర్వహించిన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో తగినంత మద్దతు లభించకపోవడంతో ఈ బిల్లు ఆమోదం పొందలేకపోయినట్లు కథనంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను తగ్గించేలా కేంద్రం తాజాగా సవరణలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డీఎంకే, ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం) వంటి పార్టీల మద్దతు కీలకం కానుంది. లోక్‌సభలో 22 మంది సభ్యులున్న డీఎంకే, 8 మంది సభ్యులున్న ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం) వైఖరి బిల్లు భవితవ్యాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.

ఈ నెల 30 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్‌ను కోరినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.
- నవంబర్ 30: లోక్‌సభ సమావేశం
- డిసెంబర్ 2: రాజ్యసభ సమావేశం
- డిసెంబర్ 3: ప్రత్యేక సమావేశాల ముగింపు
ఈ సమావేశాల్లో అత్యంత కీలకమైన బిల్లులపై చర్చ జరగనున్నట్లు కేంద్రం సంకేతాలిచ్చింది.

సభకు హాజరుకావాలని ఎంపీలకు రిజిజు విజ్ఞప్తి

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఎంపీలకు కీలక విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న అత్యంత ముఖ్యమైన బిల్లులపై చర్చించేందుకు సభ్యులందరూ సభా కార్యకలాపాల్లో పాల్గొనాలని కోరారు.
ప్రస్తుతం ప్రవేశపెట్టనున్న బిల్లుల పూర్తి వివరాలను తర్వాత వెల్లడిస్తామని తెలిపారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాన్ని ముందుకు తీసుకువస్తున్నామని, దీనిపై ఎంపీలందరూ నిర్మాణాత్మకంగా చర్చల్లో పాల్గొనాలని సూచించారు.

పార్లమెంటు సజావుగా సాగడం అందరి బాధ్యత

ప్రపంచ దేశాలన్నీ భారత ప్రజాస్వామ్య వ్యవస్థను గమనిస్తున్నాయని రిజిజు పేర్కొన్నారు. పార్లమెంటు సమావేశాలను బాధ్యతాయుతంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని అన్నారు. సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించే వ్యాఖ్యలు చేయవద్దని ఇప్పటికే విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. వర్షాకాల, శీతాకాల, బడ్జెట్ సమావేశాలతో పాటు అవసరాన్ని బట్టి ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం పార్లమెంటరీ సంప్రదాయమని వివరించారు. సభలో సభ్యులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు ఉందని, అదే సమయంలో సభ సమర్థవంతంగా పనిచేసేలా చూడటం అందరి సమష్టి బాధ్యత అని స్పష్టం చేశారు.

దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలే కీలకం!

డీలిమిటేషన్ ప్రక్రియలో జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను నిర్ణయిస్తే జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తులో రాజకీయ ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందన్న ఆందోళనలు చాలాకాలంగా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లోనూ ఒకే నిష్పత్తిలో సీట్లు పెంచాలన్న కేంద్ర ప్రతిపాదనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ సవరణలు పార్లమెంటు ఆమోదం పొందితే దేశ రాజకీయ వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ స్థానాల పెంపు, రాష్ట్రాలవారీగా ప్రాతినిధ్యం వంటి అంశాలపై రానున్న ప్రత్యేక సమావేశాల్లో రాజకీయంగా కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నాయి.

మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి



అంకుశం న్యూస్ విజయవాడ నవంబర్ 27 ఎన్టీఆర్ జిల్లాలో రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగినమాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు సతీమణి, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ మాతృమూర్తి వసంత హైమావతి మృతి పట్ల విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం నందిగామ నియోజకవర్గంలోని ఐతవరంలో ఉన్న వసంత హైమావతి స్వగృహానికి ఎంపీ కేశినేని చిన్ని వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె పార్థివదేహంపై పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం మాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావును, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను, ఇతర కుటుంబ సభ్యులను ఎంపీ కేశినేని చిన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, వసంత హైమావతి మృతి వసంత కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ పెద్దగా అందరికీ ఆప్యాయతను పంచుతూ, కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాలను పొందిన ఆమె మరణం బాధాకరమన్నారు. ఆమె మృతి పట్ల తనకు తీవ్ర విచారం కలిగిందని తెలిపారు. ఆప్తులను కోల్పోయిన బాధను మాటల్లో వర్ణించలేమని, ఈ విషాద సమయంలో వసంత నాగేశ్వరరావు, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌తో పాటు కుటుంబ సభ్యులందరికీ భగవంతుడు మనోధైర్యాన్ని, ధైర్యస్థైర్యాలను ప్రసాదించాలని ప్రార్థించారు. వసంత హైమావతి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ బాధను తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆకాంక్షించారు.

పంచాయతీ ఎన్నికలు ఫలితాలు చూసి మురిసిపోవద్దు తోపుదుర్తి







మేమే అక్రమాలకు పాల్పడి ఉంటే.. వాళ్లు ఎలా గెలిచారు

మీ మెజారిటీ... మా రెబల్ అభ్యర్థులకు వచ్చిన ఓట్లతో సమానం

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్ట్రాంగ్ కౌంటర్

అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 27 రాప్తాడు నియోజకవర్గ పంచాయతీ ఎన్నికల్లో ఫలితాలను చూసి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బలుపుగా భావిస్తున్నారని.. అది కేవలం వాపు అన్నది తెలుసుకుంటే మంచిదని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గంలోని మొత్తం 96 పంచాయతీలకు గాను 52చోట్ల టీడీపీ, ఒక చోట జనసేన.. మొత్తం 53 స్థానాలలో అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు రామగిరి మండలం, వెంకటాపురం, అనంతపురంలోని ఎమ్మెల్యే నివాసాలకు భారీగా తరలివచ్చి పరిటాల సునీతను కలిశారు. నూతన సర్పంచులు, వార్డు సభ్యులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. వారిని ఘనంగా సత్కరించారు. అలాగే తమకు అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే సునీతను ఘనంగా సత్కరించి.. ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. ఎన్నికల్లో తాము అక్రమాలకు పాల్పడ్డామని ప్రకాష్ రెడ్డి ఆరోపించడం హాస్యాస్పదమని, వాపుని చూసి బలుపు అనుకోవద్దని ఘాటుగా విమర్శించారు. నిజంగా తామే అధికార బలంతో అక్రమాలకు పాల్పడి ఉంటే స్వల్ప తేడాతో కోల్పోయిన మరో 20 పంచాయతీలను కూడా గెలిపించుకునే వాళ్లమని స్పష్టం చేశారు. రామగిరి మండలం పేరూరు పంచాయతీలో వైసీపీ అభ్యర్థి కేవలం ఒక్క ఓటుతో గెలిచారని, తామే గనుక ఫలితాలను తారుమారు చేసేవాళ్లమైతే ఆ ఒక్క ఓటును మేనేజ్ చేసుకోలేమా అని సూటిగా ప్రశ్నించారు. మీ కరపత్రికలో 10 ఓట్ల ఆధిక్యం ఉంటే 200 ఓట్ల భారీ ఆధిక్యం వచ్చినట్లు తప్పుడు రాతలు రాసుకుంటున్నారని విమర్శలు చేశారు. అసలు 190 ఓట్లు మార్చడానికి సాధ్యమవుతుందా అని నిలదీశారు. ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరిగాయన్న విషయం మీకు కూడా తెలుసని అన్నారు. అసలు వైసీపీ గెలిచిన స్థానాల వెనుక ఉన్న అసలు లెక్కలను ప్రకాష్ రెడ్డి తెలుసుకోవాలని సునీత ఎద్దేవా చేశారు. ఒకే పంచాయతీలో తమ పార్టీకి చెందిన అభ్యర్థులు ఎక్కువ మంది రెబల్స్‌గా పోటీలో ఉండటం వల్ల ఓట్లు చీలిపోయి కొన్ని కీలక పంచాయతీలను తాము కోల్పోయామని వివరించారు. ఉదాహరణకు రాప్తాడు పంచాయతీలో వైసీపీ అభ్యర్థికి 1,405 ఓట్లు రాగా, బరిలో ఉన్న ముగ్గురు టీడీపీ మద్దతుదారులకు (965 + 1,365 + 1,305) కలిపి ఏకంగా 3,635 ఓట్లు వచ్చాయని, అంటే టీడీపీకి 2,230 ఓట్ల భారీ ఆధిక్యం ఉన్నప్పటికీ ఓట్లు చీలిపోవడం వల్ల వైసీపీ అభ్యర్థి కేవలం 40 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలిచారని గుర్తుచేశారు. ఇదే తరహాలో ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి మండలంలోని మేడాపురం, నాగసముద్రం పంచాయతీల్లో తమ రెబల్ అభ్యర్థుల వల్లే వైసీపీ గెలిచిందని, ఇదేనా మీ బలం అని ప్రశ్నించారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని 5పంచాయతీల్లో టై, మరియు 1నుంచి 40 ఓట్ల లోపు అత్యంత స్వల్ప తేడాతో తాము ఓడిపోయామని.. రంగంపేట (9), గాండ్లపర్తి (24), రాప్తాడు (40), పేరూరు (1), బసంపల్లి (37) స్థానాల్లో వైసీపీకి వచ్చిన మొత్తం మెజారిటీ కేవలం 111 ఓట్లు మాత్రమేనన్నారు. ఇక పులేటిపల్లిలో సమాన ఓట్లు రాగా లాటరీలో వైసీపీకి దక్కిందని గణాంకాలతో సహా వివరించారు. మొత్తం 96 పంచాయతీల్లో కూటమి 55 శాతం స్థానాలు 13,252 మెజారిటీ ఓట్లతో కైవసం చేసుకుంటే, వైసీపీ 43 శాతం స్థానాల వద్దే 9,831 మెజారిటీ ఓట్ల వద్ద ఆగిపోయిందన్నారు. అంటే మా రెబల్ అభ్యర్థులకు వచ్చిన 09వేల ఓట్లకన్నా మీ మెజారిటీ 831ఓట్లు ఎక్కువ. గతంలో మీలాగా తాము అక్రమాలకు పాల్పడి ఉంటే.. ఒక్క స్థానం కూడా గెలవలేరన్నారు. ఇవి పార్టీ గుర్తు మీద కాకుండా స్థానికంగా ఎంపిక చేసిన అభ్యర్థులను బట్టి కూడా ఉంటాయన్నారు. మా పార్టీలో ఆశావహులు ఎక్కువ కావడం వలన కొన్ని చోట్ల మీకు అనుకూలంగా మారిందన్నారు. అంతే తప్ప ఇందులో ప్రకాష్ రెడ్డి గొప్పతనం, ఆ పార్టీని చూసి కాదన్నది తెలుసుకోవాలన్నారు. ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత హితవు పలికారు.

చట్టసభలలో బిసి లకు 44 రిజర్వేషన్ అమలు చేయాలి



పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదించాలి కేంద్ర ప్రభుత్వంకు,

డాక్టర్ పోతుల నాగరాజు !

అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 27 దేశంలో భారత రాజ్యాంగ ఫలాలు ప్రజలకు సమానంగా అందాలి అంటే సామజిక న్యాయం అమలు జరగాలి. దేశ జనాభాలో 56%పైగా ఉన్న బలహీన వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమము జరగనిది దేశం ఏ విదంగా అభివృద్ధి చెందుతుంది. ఈ వర్గాలకు అసెంబ్లీ, పార్లమెంట్ లో ప్రతినిధ్యం లేకపోతే వారి గురించి ఎవరు ఆలోచన చేస్తారు. అని పోతుల నాగరాజు నిలదీశారు నవంబర్ 30 నుంచి ప్రారంభం అయ్యే పార్లమెంట్ సమావేశాలలో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెంచాలి అని, మహిళ లకు 33%రిజర్వేషన్ అమలు కోసం రాజ్యాంగ సవరణ చేయాలి అని ఈ సమావేశంలో ఈ బిల్లుకు మెజారిటీ సభ్యుల మద్దతు కోసం అన్ని పార్టీ లను కేంద్ర ప్రభుత్వ పెద్దలు సమాలోచనలు చేస్తా ఉన్నారు. మరి ఎందుకు ఏ పార్టీ కానీ ఏ పార్లమెంట్ సభ్యులు కానీ దీజ లకు చట్టసభ లలో అవకాశం ఇవ్వండి అని డిమాండ్ చేయలేదు. కనీసం ప్రకటన కూడా చేయడానికి ముందుకు రావడం లేదు. అని పోతుల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు మరి ఈ అంశం మీద ఇప్పటికే అసెంబ్లీ తీర్మానం చేసిన పార్టీ లు తెలుగుదేశం పార్టీ, వైస్సార్సీపీ ల అధ్యక్షులు ఎందుకు నోరు మెదపడము లేదు? తెలంగాణ రాష్ట్రము లో కూడా దీ=ా పార్టీ అధికారం లో ఉన్నప్పుడు, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ గారు కూడా ఈ డిమాండ్ కోసం గతం లో ప్రకటన చేశారు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారు? అని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి, వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు గారు, ఈ పార్టీల అధ్యక్షులను ప్రశ్నిస్తూ, ప్రధాన మంత్రి గారికి విజ్ఞప్తి చేయడం జరుగుతుంది,. దీజ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడవద్దు, మీరు దేశం కోసం ఏ విదంగా అనేక నిర్ణయాలు తీసుకొని వాటి అమలు కోసం అనేక సందర్భాలలో రాజ్యాంగ సవరణ ద్వారా అమలు చేశారు. ఇప్పుడు బలహీన వర్గాల ప్రజల కు రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేసే అవకాశం అన్ని పార్టీ లకు వచ్చింది. ఇలాంటి అవకాశంను పార్లమెంట్లో దీజ లకు చట్ట సభ లలో 44 రిజర్వేషన్ అమలు కోసం అన్ని పార్టీ ల అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు కూడా ఈ డిమాండ్ అమలు కోసం ముందుకు రావాలి అని, ఆ బాధ్యత చంద్రబాబు తీసుకొని సామజిక న్యాయం కోసం పని చెసిన వ్యక్తి గా చరిత్ర లో నిలిచి పోయే విదంగా ముందుకు రావాలి అని బాబు గారికి ఇతర పార్టీ ల అధ్యక్షులకు డాక్టర్ పోతుల నాగరాజు విజ్ఞప్తి చేశారు

పి.వి. ద్వయం జీవనరేఖలు గ్రంథావిష్కరణ

హైదరాబాద్‌లో ఘనంగా కార్యక్రమం..

ముఖ్య అతిథిగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అంకుశం న్యూస్‌లిహైదరాబాద్ నవంబర్ 27: భారత మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావు (పి.వి.) జీవిత విశేషాలు, ఆయనతో ముడిపడిన అనుబంధాలను ప్రతిబింబించేలా పి.వి. మనోహరరావు రచించిన లి"పి.వి. ద్వయం -- జీవనరేఖలు"లి గ్రంథావిష్కరణ కార్యక్రమం గురువారం రాత్రి హైదరాబాద్‌లోని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. పి.వి.యమ్. ఫౌండేషన్ సర్వార్థ సంక్షేమ సమితి, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌లోని అవనిగడ్డ శాసనసభ్యులు, మాజీ ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథిగా శ్రీ శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజు విచ్చేశారు. వీరిద్దరూ కలిసి గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు, శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ, డాక్టర్ బి. జయరాములు, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, డాక్టర్ సంగనభట్ల నర్సయ్య, డాక్టర్ లలితావాణి పాల్గొన్నారు. అలాగే ఫౌండేషన్ ట్రస్టీలు పి.వి. మదన్ మోహన్, డాక్టర్ వి.వి. రామారావు, పి.వి. రాజమోహన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత రాజకీయ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన పి.వి. నరసింహారావు జీవిత విశేషాలను, ఆయన వ్యక్తిత్వంలోని విభిన్న కోణాలను గ్రంథ రూపంలో అందించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకతగా నిలిచింది. పి.వి. జీవితానికి సంబంధించిన అంశాలను అక్షరబద్ధం చేసిన ఈ గ్రంథం పాఠకులకు ఆయన జీవన ప్రస్థానాన్ని మరింత దగ్గరగా పరిచయం చేయనుంది. పి.వి. వంటి బహుముఖ ప్రజ్ఞాశాలి జీవిత విశేషాలను గ్రంథాల రూపంలో భవిష్యత్ తరాలకు అందించడం ద్వారా ఆయన సేవలు, ఆలోచనలు, వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఈ సందర్భంగా పలువురు నిమ్మరాజు, ఉప్పలపాటి ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు, ఫార్మా కన్సల్టెంట్ ఉప్పలపాటి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. తామిద్దరూ ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న రోజుల్లో పి.వి. నరసింహారావుతో తమకు ఏర్పడిన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. దివంగత ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్వగ్రామమైన వినోదరాయునిపాలెంలో జరిగిన ప్రకాశం పంతులు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి హోదాలో పి.వి. నరసింహారావు ఒంగోలు నుంచి రోడ్డు మార్గాన వెళుతున్నారని వారు తెలిపారు. ఆ సమయంలో తామందరం పాఠశాల ఎదుట నిలబడి పి.వి. నరసింహారావుకు ఘన స్వాగతం పలికిన సందర్భాన్ని నేటికీ మరువలేకపోతున్నామని పేర్కొన్నారు. విద్యార్థి దశలో చూసిన ఆ మహనీయుడి జ్ఞాపకం తమ మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని వారు భావోద్వేగంగా గుర్తు చేసుకున్నారు.



నన్ను గెలిపించండి అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా



అంకుశం న్యూస్, అమడగూరు, నవంబర్:27: ఆశీర్వదించండి, అభివృద్ధి చేసి చూపిస్తామని షేక్ ముబారక్ తుమ్మల పంచాయతీలో ఊపందుకున్న ప్రచారం జోరుగా కొనసాగించాడు. అమడగూరు మండలం తుమ్మల, కొత్తపేట, వెంకటనారాయణపల్లి, సద్దలవాండ్లపల్లి, మలకవారిపల్లి, ఎగువ తాండ, దిగువ తాండ, పుట్లవాండ్లపల్లి గ్రామాలలో ముమ్మరంగా ప్రచారం చేశారు.ఈ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజల అమూల్యమైన ఓటును" కత్తెర" గుర్తుకు వేయాలని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు.షేక్ ముబారక్ గెలుపు కోసం పలు గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేసి, కత్తెర గుర్తుకే ఓట్లు వేయాలని ఓటర్లను కోరారు. ప్రజలు తమకు ఆశీస్సులు ఇస్తే పంచాయతీలోని గ్రామాలన్నీ అభివృద్ధి చేసి చూపిస్తామని, తమను గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. పంచాయతీలోని ఓటర్లు సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న షేక్ ముబారక్‌కు ఓట్లు వేసి గెలిపిస్తే, గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు రెట్టింపు అభివృద్ధి చేస్తామని ఓటర్లకు వివరించారు.ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, సీనియర్ టీడీపీ నాయకులు దేవిరింటి మల్ రెడ్డి, ఐటీడీపి నాయకుడు శ్రీనివాసులు, మల్లికాయల బాబు,గోవర్ధన్, హైదర్ వలిసాబ్, రాజారెడ్డిమహబూబ్ పీరా, మహబూబ్ బాషా, కొత్తపేట షఫీ, లక్ పతి, ముని, గంగాధర, నాగార్జునలతో పాటు పెద్ద ఎత్తున యువకులు,ఐటీ ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

కనకదాసు ఆశయాలు, భక్తి తత్వం ఆదర్శనీయం

- : జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్

అంకుశం న్యూస్అనంతపురం, నవంబర్ 27: - నేటి సమాజంలో కుల, మత భేదాలకు అతీతంగా మానవత్వమే ప్రధానమని భక్తి తత్వాన్ని చాటిచెప్పిన మహనీయుడు భక్త కనకదాసు అని అనంతపురం జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్ పేర్కొన్నారు. భక్త కనకదాసు జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.లి - ఈ సి.విష్ణుచరణ్ వారు జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోల, బిసి సంక్షేమ శాఖ అధికారిణి ఖుష్బూ కొఠారి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఏ.బాలకొండయ్య, తదితర అధికారులతో కలిసి భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పుష్పాంజలి సమర్పించారు. -





ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ, కనకదాసు తన కీర్తనల ద్వారా భక్తి మార్గంతో పాటు సామాజిక చైతన్యాన్ని కలిగించారని కొనియాడారు. ఆయన రచనలు, బోధనలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన సన్మార్గం అనుసరణీయమని తెలిపారు.లిఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈ.డీ సుబ్రహ్మణ్యం, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొట్లూరు సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మారుతి విజయం!



అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 27 శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం గొట్లూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి గొట్లూరు మారుతి 251 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. దీంతో గొట్లూరులో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. మా నీరుగంటి మారుతీ కుమార్ విజయం పట్ల ఆయన అభిమానులు వైసిపీ అభిమానులు కేతిరెడ్డి అభిమానులు హర్షం ప్రకటించారు.

విజయవాడ నగర మేయర్ వంగవీటి రాధాకృష్ణ ను సత్కరించిన ఆకుల శ్రీనివాస్



అంకుశం న్యూస్ విజయవాడ నవంబర్ 27: విజయవాడ నగర మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన వంగవీటి రాధాకృష్ణ ను ప్రముఖ సామాజికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్ లో నగర ప్రథమ పౌరుడిగా బాధ్యతలు చేపట్టిన వంగవీటి రాధాకృష్ణను కలిసిన ఆకుల శ్రీనివాస్ ఈ శుభసందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మేయర్‌గా తన ఛాంబర్‌లో ఆసీనులైన వెంటనే వంగవీటి రాధాకృష్ణ నగరంలో పారిశుద్ధ్యం (శానిటేషన్), ప్రజారోగ్య సమస్యల పరిష్కారానికి సంబంధించిన " మిషన్ హెల్తీ విజయవాడ " ఫైల్‌పై తన తొలి సంతకం చేయడం అభినందనీయమని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. పదవీ బాధ్యతలు చేపట్టిన తొలి క్షణం నుంచే ప్రజా సమస్యల పరిష్కారానికి రాధాకృష్ణ చూపిన చొరవ, నగరాభివృద్ధి పట్ల ఆయనకున్న అంకితభావానికి, పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొన్నారు. విజయవాడ నగర అభివృద్ధితో పాటు పచ్చదనం, పరిశుభ్రత , ప్రజారోగ్యమే లక్ష్యంగా నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తారన్న విశ్వాసం నగర ప్రజల్లో వ్యక్తమవుతోందనన్నారు . దివంగత మహా నేత స్వర్గీయ వంగవీటి మోహనరంగా వారసునిగా వంగవీటి రాధాకృష్ణ విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేస్తారన్న విశ్వాసం ప్రజల్లో ఉందని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు.

సీనియర్ జర్నలిస్టు పంతంగి రాంబాబుకు కీర్తి పురస్కారం

'జనరంజక విజ్ఞానం' ప్రక్రియలో నాగసూరి గౌరమ్మ సంజీవయ్య పురస్కారం ప్రదానం



అంకుశం ప్రతినిధిలి హైదరాబాద్ (నాంపల్లి), నవంబర్ 27: ప్రముఖ సీనియర్ జర్నలిస్టు పంతంగి రాంబాబు కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్ డాక్టర్ ఎన్టీఆర్ కళామందిరంలో గురువారం సాయంత్రం నిర్వహించిన కీర్తి పురస్కారాల ప్రధానోత్సవంలో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. 'జనరంజక విజ్ఞానం' ప్రక్రియలో నాగసూరి గౌరమ్మ సంజీవయ్య పురస్కారాన్ని పంతంగి రాంబాబు అందుకున్నారు. తెలుగు జర్నలిజం రంగంలో విశేష అనుభవం కలిగిన ఆయనకు ఈ పురస్కారం లభించడం పట్ల సహచర జర్నలిస్టులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేదికపై పంతంగి రాంబాబును సహచర సీనియర్ జర్నలిస్టులు టీఎస్ ప్రకాష్, అమరయ్య, నిమ్మరాజు చలపతిరావు, అక్బర్ పాషా, జ్యోతి శ్రీ, పరందామరాజు, ఉప్పలపాటి శ్రీనివాసమూర్తి ఘనంగా సత్కరించి అభినందించారు. పురస్కారం అందుకున్న రాంబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన జర్నలిజం రంగంలో చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. పత్రికా రంగంలో అనుభవం, ప్రజలకు విజ్ఞానాన్ని అందించే రచనా ప్రక్రియ, సమాజానికి ఉపయోగపడే సమాచారాన్ని జనరంజకంగా అందించడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనది. ఈ నేపథ్యంలో 'జనరంజక విజ్ఞానం' ప్రక్రియలో పంతంగి రాంబాబుకు పురస్కారం అందించడం విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. సీనియర్ జర్నలిస్టుగా పంతంగి రాంబాబు సాధించిన ఈ గౌరవం పట్ల ఆయన మిత్రులు, సహచరులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ పురస్కారం ఆయన వృత్తి జీవితంలో మరో మైలురాయిగా నిలిచింది.

గ్రామ సమగ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తా

: నూతన సర్పంచ్



-భూమిరెడ్డి మహానంద రెడ్డి

రాప్తాడు అంకుశం న్యూస్ నవంబర్ 27 మండలంలో మేజర్ పంచాయతీ అయిన ప్రసన్నాయపల్లి గ్రామ సమగ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని సర్పంచిగా గెలుపొందిన భూమిరెడ్డి మహానంద రెడ్డి అన్నారు. మాజీ సర్పంచ్ భూమిరెడ్డి సావిత్రమ్మతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. రాబోయే ఐదేళ్ల పాటు పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని సర్పంచ్ స్పష్టం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో ఎనిమిదవ పర్యాయం ఘన విజయాన్ని అందించిన గ్రామ పంచాయతీ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ?ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు పంచాయతీ జనరల్ ఫండ్‌ను సమన్వయం చేసి, పూర్తి నిష్పక్షపాతంగా, సాచురేషన్ పద్ధతిలో అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో కులాల కుంపట్లు పెట్టేవారికి, కుట్ర రాజకీయాలకు, కక్ష కార్పణ్యాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ తావులేదన్నారు. ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేసిన జిల్లా కలెక్టర్ ఆనంద్ కు, అనంతపురం ఎస్పీ జగదీష్ కు రాప్తాడు డీఎస్పీ కార్యాలయ ఏఎస్పీ అశ్విన్ కాకుమాను, సీఐ ధరణి కిషోర్, ఎస్సై ధరణి బాబు, ఎన్నికల అధికారి శేషగిరిరావుతో పాటు విధులు నిర్వహించిన సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలందరికీ నిత్యం అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు.

కుతుకులూరులో వైయస్ఆర్సీపీ ఎన్నికల ప్రచార ర్యాలీలో మాజీఎమ్మెల్యే



తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 27: ఈనెల 29న జరగనున్న కుతుకులూరు గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం వైయస్ఆర్సీపీ ఆధ్వర్యంలో భారీ ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సబ్బెళ్ళ నాగిరెడ్డి, వార్డు సభ్యులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఎన్నికల ప్రచార రథంపై ఉండి ప్రజలను ఉద్దేశించి ప్రచారం చేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీకి పార్టీ శ్రేణులు, అభిమానులు,గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ ఎన్నికల్లో వైయస్ఆర్సీపీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని సత్తి సూర్యనారాయణ రెడ్డి ఓటర్లను కోరారు.

అనపర్తిఅభివృద్ధికి కొన్నిచేసాం,మరికొన్ని చేస్తున్నాం,ఇంకాకొన్ని చేసిచూపస్తాం

-ఎమ్మెల్యే నల్లమిల్లి

"అన్న క్యాంటీన్" ఏర్పాటు చేశాం

అనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేశాం

ఫోర్ లైన్స్ రోడ్డు గా కెనాల్ రోడ్డును అభివృద్ధి చేస్తాం

"జన్మభూమి" హాల్ట్ ను తీసుకొచ్చాం





తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 26: చినపొలమూరు-కుమ్మర వీధి- దేవి చౌక్- గాంధీ బొమ్మ సెంటర్- మెయిన్ రోడ్డు-ఫ్లై ఓవర్- ఇందిరా కాలనీ వరకు ఎమ్మెల్యే నల్లమిల్లి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార ర్యాలీ చేపట్టారు. అనపర్తిలో పంచాయతీ ఎన్నికలు సందర్భంగా అనపర్తి గ్రామ పంచాయతీ కూటమి సర్పంచ్ అభ్యర్థి మీసాల శ్రీనివాస్ (వాసు)కి "ఉంగరం" గుర్తుపై మరియు కూటమి బలపరచిన వార్డు మెంబర్స్ అభ్యర్థులకి తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని అనపర్తి చినపొలమూరు- కుమ్మర వీధి- దేవి చౌక్- గాంధీ బొమ్మ సెంటర్- మెయిన్ రోడ్డు- ఫ్లై ఓవర్- ఇందిరా కాలనీ వరకు ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, అనపర్తి నియోజకవర్గం కూటమి నాయకులు, కార్యకర్తలు, అనపర్తి టౌన్ కూటమి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ప్రసన్నాయపల్లి సర్పంచ్ మహానంది రెడ్డికి శుభాకాంక్షలు



?రాప్తాడు, అంకుశం న్యూస్ నవంబర్ 27 మండలంలోని ప్రసన్నాయపల్లి సర్పంచ్గా ఎన్నికైన భూమిరెడ్డి మహానంది రెడ్డికి రాప్తాడు మండల కేంద్రానికి చెందిన దండు రామాంజనేయులు, దండు శంకర్ గురువారం ఉదయం పూలమాల వేసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో వివిధ వర్గాల ప్రజలకు, ఆపదలో ఉన్న వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, అవసరమైన సాయం అందిస్తూ మహానంది రెడ్డి అందరి మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. ప్రసన్నాయపల్లి సర్పంచ్గా రాబోయే ఐదేళ్ల పదవీకాలంలో పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని వారు ఆకాంక్షించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలని అభిలషించారు. అనంతరం గ్రామంలోని మౌలిక వసతుల కల్పన, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి అంశాలతో పాటు ప్రజల సమస్యల సత్వర పరిష్కారంపై పలు అంశాలపై వారు చర్చించారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. దీనికి స్పందించిన నూతన సర్పంచ్ భూమిరెడ్డి మహానంది రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన రామాంజనేయులు, శంకర్లకు ధన్యవాదాలు తెలియజేశారు. అందరి సలహాలు, సూచనలు తీసుకుంటూ ప్రసన్నాయపల్లి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చక్రాయపేట సర్పంచ్ అభ్యర్థి చింతకాయల సావిత్రమ్మకు మద్దతుగా బండమీదపల్లిలో ఇంటింటి ప్రచారలో సీనియర్ టీడీపీ నాయకుడు కాయల రమణ...



అంకుశం న్యూస్, శింగనమల, నవంబర్ : 27 ఉంగరం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి అనంతపురం జిల్లా, శింగనమల మండలం చక్రాయపేట గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ మద్దతుతో బరిలో నిలిచిన చింతకాయల సావిత్రమ్మకు మద్దతుగా ఈరోజు బండమీదపల్లి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ప్రచారంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని గ్రామ ప్రజలను కలిశారు. సర్పంచ్ అభ్యర్థి చింతకాయల సావిత్రమ్మకు కేటాయించిన ఉంగరం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న అభ్యర్థికి ప్రజలంతా మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని నాయకులు కోరారు.

అష్టోత్తర శివలింగ అభిషేకం, మహా బిల్వార్చన మహోత్సవంలో పాల్గొన్న మంత్రి సుభాష్

ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక, దైవచింతన కలిగి ఉండాలి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్





కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 27: శివనామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న 108 అష్టోత్తర శివలింగ అభిషేకం, మహా బిల్వార్చన మహోత్సవంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి శేషారావు, కూటమి పార్టీ సీనియర్ నేత, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. శ్రీ మణికంఠ అన్న సమారాధన సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీను గురుస్వామి నేతృత్వంలో ఈ మహోన్నత ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకాకుళం సూర్యనారాయణ (చిన్ని స్వామి), అంజనీ దేవి దంపతులు, చెరుకుపల్లి గణేష్ శర్మ ఆధ్వర్యంలో 108 మంది దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని శివలింగాలకు అభిషేకాలు, మహా బిల్వార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శివనామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పునీతం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. హిందూ సనాతన ధర్మంలో శివారాధనకు విశిష్టమైన స్థానం ఉందని అన్నారు. 108 అష్టోత్తర శివలింగ అభిషేకం, మహా బిల్వార్చన వంటి పవిత్ర కార్యక్రమాలు భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కూటమి పార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం, మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి శేషారావు మాట్లాడుతూ భక్తి, సేవ, సమాజ శ్రేయస్సు అనే గొప్ప ఆశయాలతో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. భగవంతుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పరమశివుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, పాల్గొన్న గురుస్వాములు, అయ్యప్ప భక్తులను మంత్రి అభినందించారు.

బాల్య వివాహ రహిత శ్రీ సత్యసాయి జిల్లా నిర్మాణమే లక్ష్యం

జిల్లా కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జిల్లా స్థాయి 'చేతన' కార్యక్రమం

బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలికా విద్య ఆవశ్యకతపై దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్





అంకుశం న్యూస్ పుట్టపర్తి, నవంబర్ 27: అంతర్జాతీయ బాల్య వివాహాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి రైల్వే స్టేషన్ నంధు గల రెవెన్యూ భవన్ లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి 'చేతన' అవగాహన కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ విశిష్ట అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. తల్లిదండ్రుల స్వచ్ఛంద అంగీకార పత్రాలు -- కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణ: ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 500 మంది బాలికలు, 500 మంది తల్లిదండ్రులతో కలిపి మొత్తం 1,000 మంది ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారు. సభకు హాజరైన బాలికలు, తల్లిదండ్రులందరూ కలిసి "బాల్య వివాహ రహిత శ్రీ సత్యసాయి జిల్లా నిర్మాణానికి మా వంతు కృషి చేస్తాం" అంటూ ముక్తకంఠంతో ప్రతిజ్ఞ చేశారు. తమ కుమార్తెలకు 18 సంవత్సరాలు నిండే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాహం చేయబోమని, వారిని ఉన్నత చదువులు చదివిస్తామని 500 మంది తల్లిదండ్రులు స్వచ్ఛందంగా లిఖితపూర్వక అంగీకార పత్రాలపై సంతకాలు చేసి జిల్లా కలెక్టర్కు అందజేయడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతేకాకుండా,తమ గ్రామాల్లో ఇతరులకు కూడా బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పిస్తామని వారు ప్రతినబూనారు. బాల్య వివాహాలతో బాలికల భవిష్యత్తుకు తీవ్ర నష్టం: జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, ప్రాథమిక హక్కులు మరియు ఉజ్వల భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని వ్యక్తం చేశారు.చిన్న వయస్సులోనే వివాహం చేయడం ద్వారా తమ బాధ్యత తీరిపోతుందని తల్లిదండ్రులు భావించడం అత్యంత ప్రమాదకరమైన అపోహ అని స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల బాలికలు శారీరక,మానసిక,సామాజిక సమస్యలతో పాటు తీవ్రమైన ఆరోగ్య సంక్షోభాలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ముఖ్యంగా బాల్య గర్భధారణ వల్ల తల్లి, శిశువు ఇద్దరి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.తమ కుమార్తెలకు 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేయబోమని తల్లిదండ్రులు నేడు తీసుకున్న సాహసోపేత నిర్ణయం ఎంతో అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు. ఈ మార్పు కేవలం ఇక్కడితో ఆగిపోకుండా,ప్రతి తల్లిదండ్రులు తమ గ్రామాల్లోని ఇతర కుటుంబాలకు కూడా ఈ సందేశాన్ని చేరవేసి, బాల్య వివాహాల నిర్మూలనలో సామాజిక బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ... జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే సున్నిత ప్రాంతాలను (హాట్స్పాట్లను) ముందుగానే గుర్తించి,ఆయా గ్రామాల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించడం ద్వారా ఈ దురాచారాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చని సూచించారు. కేవలం చట్టపరమైన చర్యలే కాకుండా, పోలీస్, రెవెన్యూ, విద్యా, మహిళా శిశు సంక్షేమ శాఖలు మరియు స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో క్షేత్రస్థాయిలో నిరంతర నిఘా, చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమీల కార్యక్రమ ఉద్దేశాన్ని వివరిస్తూ.. జిల్లా కలెక్టర్ ఆలోచనల మేరకు రూపొందించిన 'చేతన' కార్యక్రమం ద్వారా కేవలం విద్యార్థినులకే కాకుండా, నిర్ణయాధికారం కలిగిన తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించి వారిని నేరుగా ఈ ఉద్యమంలో భాగస్వాములను చేశామని తెలిపారు. ఉమెన్ ఎంపవర్మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ మాట్లాడుతూ.. ఒక బాలికకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా ఆ కుటుంబం యొక్క తలరాత మారుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ కుమార్తెలను ఉన్నతంగా చదివించి ఆర్థిక, సామాజిక స్వావలంబన దిశగా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ప్రమీల, డీఎంహెచ్ఓ ఫైరోజా బేగం,డీఆర్డీఏ పీడీ నరసయ్య, ఉమెన్ ఎంపవర్మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, బీసీ సంక్షేమ అధికారి రాజేంద్రనాథ్ రెడ్డి, మెప్మా పీడీ నాగరాజు, జీసీడీఓ అనిత, డీసీపీఓ మహేష్ పాల్గొన్నారు. వీరితో పాటు చేతన ఈశ్వరమ్మ ట్రస్ట్ ప్రతినిధులు, సీఐఎఫ్ ప్రతినిధి కొండప్ప, సమత ఆర్గనైజేషన్ ప్రతినిధి శ్రీనివాస్ నాయుడు, రైట్స్ ప్రతినిధి భానుజ,చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధి అరవింద్,పీఆర్డీఎస్ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి,వాసవ్య మహిళా మండలి ప్రతినిధి గీత,వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

అనంతటీడీపీ కార్యాలయంలో విజేతలను ఘనంగా సత్కారం



అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 27 32ఏళ్ల తర్వాత అనంతపురం అర్బన్ పరిధిలోని 3పంచాయతీల్లో క్లీన్ స్వీప్ చేశామని.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో కూటమి జైత్రయాత్ర దిగ్విజయంగా కొనసాగుతోంది. తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మూడుకు మూడు పంచాయతీల్లోనూ తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులు క్లీన్స్వీప్ చేసి ఘన విజయం సాధించారు. రుద్రంపేటలో హరిప్రసాద్, రాజీవ్ కాలనీలో అవుకు హరి, మరియు అనంతపురం రూరల్ పంచాయతీలో హరిత (జయరాం నాయుడు సతీమణి) విజయం సాధించడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులను ఆయన ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో 62 స్థానాలకు గాను 41 చోట్ల, 11 ఎంపీటీసీ స్థానాల్లో 9 చోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించారన్నారు. ఇప్పుడు మూడు పంచాయతీల్లోనూ సత్తా చాటడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు నిదర్శనమన్నారు. ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నూటికి నూరు శాతం నిలబెట్టుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నకిలీ ఆధార్ కార్డులు, దొంగ ఓట్లతో ఇన్నేళ్లుగా గెలుస్తూ వచ్చారని ఆరోపించారు. 2019 ఎన్నికల్లో ఏకంగా 12 వేల దొంగ ఓట్లు వేయించుకుని ఆయన గెలిచారన్నారు. మొన్నటి ఎన్నికల్లో రాప్తాడు మండలంలో ఆయన శిష్యుడు ఏకంగా 3 వేల నకిలీ ఆధార్ కార్డులతో పట్టుబడటమే వారి అక్రమాలకు ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఈ ఎన్నికల్లో ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టి మమ్మల్ని ఆదరించారన్నారు. ఇన్ని రోజులు మాపై చేస్తూ వస్తున్న విమర్శలకు ఈ విజయం ఒక సమాధానం అన్నారు. 40 ఏళ్లుగా ప్రజలు ఆదరించినా అనంత వెంకటరామిరెడ్డి ఏనాడూ అభివృద్ధి చేయలేదన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలోనూ పంచాయతీల్లో కనీసం రోడ్లు, డ్రైనేజీలు కూడా వేయకుండా గాలికొదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనంతపురాన్ని ఆనుకుని ఉన్న నాలుగు పంచాయతీలకు వందల కోట్ల రూపాయలతో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. 10 వేల జనాభా ఉన్న రాజీవ్ కాలనీలో ఇన్నేళ్లలో హైస్కూల్ లేదంటే వారి పాలన ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే హైస్కూల్ తీసుకొస్తామన్నారు. అలాగే అక్కడి డంపింగ్ యార్డ్ను క్లియర్ చేసి ఆధునిక వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు, మిగిలిన స్థలంలో ప్రజల కోసం సుందరమైన పార్కును నిర్మిస్తామన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న రుద్రంపేట తగరకుంట రోడ్డును కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వచ్చిన ఆరు నెలల్లోనే పూర్తి చేశామని.. ఆ రహదారికి డివైడర్లు, లైట్లు ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఎన్నో ఏళ్ల సమస్యలకు పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

శింగనమల నియోజకవర్గం లో మెయిన్ బజార్ బీసీ కాలనీ ఎస్సీ కాలనీలో ప్రచారంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ...



అంకుశం న్యూస్, శింగనమల, నవంబర్ :27 శింగనమల మండల కేంద్రంలోని మైన్ బజార్, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలలో పర్యటించి కూటమి సర్పంచ్ అభ్యర్థి దత్తం చంద్రిక ని మంచం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరడం జరిగింది. అలాగే 12 మంది వార్డు సభ్యుల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించి.ఈ సందర్భంగా ప్రజలను నేరుగా కలిశారు, శింగనమలలో చేపట్టిన సీసీ రోడ్లు, బస్టాండ్ ఆధునికీకరణ, ఆసుపత్రి అభివృద్ధి, కేజీబీవీ మౌలిక వసతులు, గోకులం షెడ్లు తదితర అభివృద్ధి పనులను వివరించారూ. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో ఎన్నో ఏళ్లుగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించిన విషయాన్ని ప్రజలకు తెలియజేశారూ. గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరం. అందుకే దత్తం చంద్రిక తో పాటు 12 మంది వార్డు సభ్యుల అభ్యర్థులకు ప్రజల మద్దతు కోరారు.